



# కరపత్రం

SINCE 2014

సోమవారం సెప్టెంబర్ 15 2025 | సంపుటి :0 | సంచిక :328 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




ట్రిబ్యునల్ ఎదుట
బలమైన వాదనలు
వినిపించాలి
904 టీఎంసీలు
కేటాయించేలా పట్టుబట్టాలి
నీటిపారుదల శాఖ
నిపుణులు, న్యాయవాదులతో
సీఎం రేవంత్‌రెడ్డి
నీటి వాటాల సాధనలో
కేసీఆర్ ప్రభుత్వం
విఫలమైందని ఆరోపణ

# కృష్ణా జలాల్లో రాష్ట్ర వాటా సాధిస్తాం

కృష్ణా నీటిని ఆంధ్రప్రదేశ్ అక్రమంగా తరలిస్తుండటంతో శ్రీశైలం, నాగార్జునసాగర్‌తోపాటు పులిచింతలలోని జలవిద్యుత్తు ప్రాజెక్టులు మూతపడే ప్రమాదం ముంచుకొచ్చింది. తెలంగాణ తరఫున సరైన వాదనలు వినిపించేందుకు ఇదే మంచి అవకాశం. దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ జారవిడవొద్దు. సీఎం రేవంత్‌రెడ్డి

అధికారులు, న్యాయ నిపుణుల సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన ఉత్తమ్

హైదరాబాద్: "కృష్ణాలో నికర, మిగులు, వరద జలాల్లో ఏవైనా సరే... తెలంగాణకు చెందాల్సిన వాటాలో చుక్క నీటిని కూడా వదులుకునేది లేదు. మన రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన 904 టీఎంసీల వాటాను సాధించి తీరుతాం. ఇందుకోసం ట్రిబ్యునల్‌లో సమర్థ వాదనలు వినిపించడానికి అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలి" అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అవసరమైన ఆధారాలన్నీ న్యాయనిపుణులకు అందించాలని ఇంజినీర్లు, అధికారులకు సూచించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిల్లీకి వెళ్లి ఈ విచారణలో పాల్గొంటారని, రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించేందుకు బలమైన వాదనలు వినిపించాలని న్యాయ నిపుణులకు సూచించారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో దిల్లీలో కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ విచారణ జరగనుండగా తెలంగాణ తుది వాదనలు వినిపించనుంది. పేజి 2లో ▶

## హైదరాబాద్‌లో వర్షం.. రహదారులు జలమయం



హైదరాబాద్: నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ముషీరాబాద్, రామ్‌నగర్, తార్నాక, ఎల్బీనగర్, కాచిగూడ, కుషాయిగూడ, కాప్రా, కీసర తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రహదారులు జలమయ్యాయి. దీంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## తెలంగాణ వ్యాప్తంగా తనిఖీలు.. భారీగా పట్టుబడ్డ గంజాయి



2లో

## వలపు వల..

### యోగా గురు విలవిల



హైదరాబాద్: ఓ ముఠా హనీట్రాప్ చేసి యోగా గురువు నుంచి భారీగా డబ్బులు వసూలు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది.

పేజి 2లో ▶




జూబ్లీహిల్స్ లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో కీలక సమావేశం జరుగుతోంది. ఈ సమావేశానికి టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ భేటీలో ప్రధానంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక గురించి చర్చిస్తున్నారు. మంత్రులతో పాటు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నియోజకవర్గ ఇంచార్జ్ కార్పొరేషన్ల చైర్మన్లు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. పేజి 2లో ▶

## ఈవెంట్స్ ఇండస్ట్రీతో కలిసి పనిచేయడానికి ప్రభుత్వం సిద్ధం: మంత్రి జూపల్లి



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రాభివృద్ధిలో ఈవెంట్స్ ఇండస్ట్రీ కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్ర పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని అక్షయ్ కన్వెన్షన్ సెంటర్‌లో తెలంగాణ ఛాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో జరిగిన సౌత్ ఇండియా వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్ సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈవెంట్స్ ఇండస్ట్రీతో కలిసి పనిచేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. పేజి 2లో ▶

## ఐదేళ్లుగా విమోచన దినోత్సవాన్ని కేంద్రమే నిర్వహిస్తోంది

సికింద్రాబాద్: హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫొటో ప్రదర్శనను తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు.

పేజి 2లో ▶



## అస్సాంలో భూకంపం.. 5.8 తీవ్రతతో ప్రకంపనలు

అస్సాంలో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 5.8 తీవ్రతగా నమోదైంది.

2లో



## క్యాన్సర్ టీకాలతో వారికే ప్రయోజనమా..!

ప్రాణాంతక క్యాన్సర్ ముప్పును తగ్గించేందుకు శాస్త్రవేత్తలు అనేక పరిశోధనలు చేస్తుండగా ఇటీవల వీటిలో ఎంతో పురోగతి కనిపిస్తోంది. అయితే, ఈ కొత్త క్యాన్సర్ వ్యాక్సిన్‌లు ఆరోగ్యకరమైన వ్యక్తుల్లో వ్యాధి నిరోధానికి ఉద్దేశించినవి కావని వైద్య నిపుణులు వెల్లడిస్తున్నారు. ఇప్పటికే చికిత్స పొందిన వారిలో ఇది పునరావృతం కాకుండా ఉండేందుకేనని చెబుతున్నారు.

పేజి 2లో ▶



# సంపాదకీయం

## అసహనం పరాకాష్ఠకు

'భారత రాజ్యాంగాన్ని చూసి గర్విస్తున్నాం' ..నేపాల్ పరిణామాల నేపథ్యంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ చేసిన వ్యాఖ్య ఇది. రాజ్యాంగాన్ని చూసి మాత్రమే కాదు, అంతటి మహోన్నత రాజ్యాంగాన్ని రచించి మనకు అందించిన రాజ్యాంగ నిర్మాతలను చూసి కూడా గర్వించాలి కదా? భిన్న మతాలు, భిన్న జాతులతో కూడిన మన దేశం భిన్నత్వంలో ఏకత్వంతో అప్రతిహతంగా సాగిపోవడానికి వారు అందించిన రాజ్యాంగమే ప్రాతిపదిక కదా? రాజ్యాంగం ఎంత గొప్పదైనా దాన్ని పరిరక్షించాల్సిన వ్యవస్థల అధిపతులు మంచివాళ్లు కాకపోతే పరిస్థితి ఏమిటి? శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ పరిణామాల తర్వాత మన దేశంలో కూడా ఇలాంటి పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందా? అన్న అనుమానం కొందరిలోనైనా ఏర్పడటం ఆందోళన కలిగిస్తోంది. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో రాజ్యాంగం లోపభూయిష్టంగా ఉందని కాదు.. పాలకులు బాధ్యతారహితంగా, రాజ్యం వీరభోజ్యం అన్నట్టుగా వ్యవహరించడం వల్ల అవినీతి, అరాచకాలు పెచ్చరిల్లి ప్రజల్లో అసహనం పరాకాష్ఠకు చేరింది. ఫలితమే ప్రజాగ్రహం పెల్లుబికి పాలకులు దేశం విడిచి పారిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ దుస్థితి వెనుక అమెరికా హస్తమో లేక మరొకరి హస్తమో ఉందని చెప్పుకోవచ్చు కానీ ప్రభుత్వాల పట్ల ప్రజల్లో అసంతృప్తి గూడుకట్టుకొని ఉండకపోతే తిరుగుబాట్లు చోటుచేసుకోవు. మన పొరుగు దేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌తో మన దేశాన్ని ఏ విధంగానూ పోల్చలేము. భిన్న జాతులు, భిన్న మతాలు, భిన్న సంస్కృతుల కలబోతగా ఉన్న మన దేశంలో ప్రభుత్వాలపై ఈ రూపంలో తిరుగుబాట్లు అసాధ్యం. అలా జరగాలని కూడా కోరుకోకూడదు. మన ప్రజాస్వామ్య వ్యవస్థ అనేక పరీక్షలకు నిలబడి పరిపక్వత చెందింది. ప్రజలు కూడా ఎప్పటికప్పుడు విజ్ఞత ప్రదర్శించి హద్దులు మీరిన పాలకులకు ఎన్నికల సందర్భంగా బ్యాలెట్ ద్వారా కర్రు కాల్చి వాత పెడుతున్నారు. అయితే ఏ సందర్భంలో కూడా కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రజల తీర్పు ఒకే రకంగా ఉండకపోవడం మన విశిష్టత. ఉదాహరణకు, ఎమర్జెన్సీనే తీసుకుందాం. నాటి ప్రధాని ఇందిరాగాంధీ తన అధికారానికి ముప్పు ఏర్పడుతోందని గ్రహించి దేశంలో అత్యవసర పరిస్థితిని విధించారు. ఫలితంగా లభించిన అపరిమిత అధికారాలతో అధికార యంత్రాంగం ప్రజలను హింసించింది. భావ ప్రకటనా స్వేచ్ఛను హరించివేశారు. అయితే ఉత్తరాది రాష్ట్రాలతో పోల్చితే దక్షిణాది రాష్ట్రాలలో ఎమర్జెన్సీ ప్రభావం తక్కువగా ఉండింది. ఈ కారణంగా ఉత్తరాదిలో తుడిచిపెట్టుకుపోయిన కాంగ్రెస్ పార్టీ దక్షిణాదిన కొంత మేరకు నిలదొక్కుకోగలిగింది. అత్యవసర పరిస్థితి నాటి దురాగతాలను కూడా ప్రజలు ఎన్నికల వరకు భరించి బ్యాలెట్ ద్వారా ఇందిరాగాంధీకి గుణపాఠం చెప్పారు. అంతేగానీ ప్రభుత్వంపై తిరుగుబాటు చేయలేదు. 1984లో తెలుగునాట చోటుచేసుకున్న అధికార దుర్వినియోగాన్నే తీసుకుందాం. మెజారిటీ శాసనసభ్యుల మద్దతు కలిగి ఉన్న ఎన్టీఆర్‌ను తొలగించి నాదెండ్ల భాస్కరరావును ముఖ్యమంత్రిగా అప్పటి ఉమ్మడి రాష్ట్ర గవర్నర్ రాంలాల్ నియమించారు. ఇది కూడా నాటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రోద్బలంతోనే జరిగింది. ఎన్నికల్లో గెలుపొంది అధికారంలోకి వచ్చిన ఎన్టీఆర్‌ను అన్యాయంగా, అక్రమంగా తొలగించడాన్ని జీర్ణించుకోలేని తెలుగు ప్రజలు శ్రీకాకుళం నుంచి ఆదిలాబాద్ వరకు ఆందోళన చేపట్టారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం ఊపందుకోవడంతో గవర్నర్ రాంలాల్ తన పదవికి రాజీనామా చేయవలసి వచ్చింది. ఇందిరాగాంధీ దిగివచ్చి ఎన్టీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా నియమించడానికి అంగీకరించారు. ఆ తర్వాత కొద్దిరోజులకే ఇందిరాగాంధీ హత్యకు గురయ్యారు. ఆ కారణంగా జరిగిన ఎన్నికల్లో కూడా తెలుగు ప్రజల ఆగ్రహం చల్లారలేదు.

దేశవ్యాప్తంగా సానుభూతి పవనాలు వీచి కాంగ్రెస్ పార్టీకి ఎన్నడూ లేనంత స్థాయిలో మెజారిటీ లభించి, రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి అయ్యారు. అయితే ఆ ఎన్నికల్లో తెలుగునాట మాత్రం ప్రజలు కాంగ్రెస్‌పై తమ కక్ష తీర్చుకున్నారు. అధికార దురహంకారంతో వ్యవహరిస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడిన ప్రభుత్వాలపై మన ప్రజలు బ్యాలెట్‌ను బుల్లెట్‌లా ప్రయోగించారే గానీ, పొరుగు దేశాల్లో వలె విధ్వంస చర్యలకు పాల్పడలేదు. ఇందుకు మన సమాజాన్ని చూసి మనం గర్వించాలి. అయితే ప్రజలు మాత్రమే ఎల్లవేళలా విజ్ఞత ప్రదర్శించాలనుకోవడం అత్యాశే అవుతుంది. పాలకులపై ఆ బాధ్యత ఉండదా? ప్రజల మనోభావాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలించాల్సిన బాధ్యత పాలకులపై ఉండదా? ఒక్కసారి అధికారంలోకి వస్తే ఐదేళ్లపాటు విర్రవీగుతూ అధికార దుర్వినియోగానికి, అవినీతికి పాల్పడవచ్చా? అలా చేయడం ప్రజల సహనాన్ని పరీక్షించడం కాదా? రాజ్యాంగ పరిరక్షకులుగా ఉన్న ఆయా వ్యవస్థల అధిపతులపై కూడా బాధ్యత ఉంటుంది కదా? మన రాజ్యాంగ నిర్మాతలు ఆయా రాజ్యాంగ వ్యవస్థల మధ్య సున్నితమైన లక్ష్మణ రేఖలు గీశారు. ఒక వ్యవస్థ అధికార పరిధుల్లోకి మరో వ్యవస్థ చొరబడకుండా సరిహద్దులు నిర్ణయించారు. అయితే రాజ్యాంగబద్ధమైన పదవులలో ఉన్నవారు బాధ్యతారహితంగా వ్యవహరించిన సందర్భాలలో ఆయా వ్యవస్థల మధ్య ఘర్షణ తలెత్తుతోంది. శాసనసభలో మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతు ఉన్న నాయకుడే ముఖ్యమంత్రిగా నియమితులు కావాలని రాజ్యాంగం అభిప్రాయపడింది. అదే సమయంలో గవర్నర్లు ఎవరినైనా ముఖ్యమంత్రులుగా నియమించవచ్చునని అదే రాజ్యాంగంలో పేర్కొన్నారు. దీని ఉద్దేశం దారినపోయే దానయ్యను ముఖ్యమంత్రిని చేయమని కాదు. ముఖ్యమంత్రిగా నియమితుడయ్యే వ్యక్తి అప్పటికి చట్టసభల్లో సభ్యుడు కాకపోయినా సభలో మెజారిటీ నిరూపించుకొని ఆరు నెలల్లో ఏదో ఒక సభకు ఎన్నిక కావాలని రాజ్యాంగంలో నిర్దేశించారు. సదుద్దేశంతో కల్పించిన ఈ వెసులుబాటును రాంలాల్ వంటి వారు దుర్వినియోగం చేశారు. రాజ్యాంగ నిర్మాతల అభిమతాన్ని తప్పుగా అన్వయించి అధికార దుర్వినియోగానికి పాల్పడిన సందర్భాలను ఎన్నో చూశాం. రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించిన బిల్లులను ఆమోదించే విషయంలో గవర్నర్లు, రాష్ట్రపతికి కాల వ్యవధి ఉండాలా? వద్దా? అన్నది ప్రస్తుతం సర్వోన్నత న్యాయస్థానం విచారణ పరిధిలో ఉంది. రాజ్యాంగ నిర్మాతలు సదుద్దేశంతో రాష్ట్రపతి, గవర్నర్లు, న్యాయమూర్తులకు ప్రత్యేక రక్షణలు కల్పించడంతో పాటు విశేష అధికారాలూ కల్పించారు. అలా అని మా ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తామని వారు భావిస్తే ప్రజల్లో అసహనం ఏర్పడదా? బిల్లుల ఆమోదం విషయంలో గవర్నర్లు, రాష్ట్రపతికి గడువు విధిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం ఏమిటని పాలకులు ప్రశ్నిస్తున్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన ప్రాథమిక బాధ్యత సర్వోన్నత న్యాయస్థానం పైనే ఉంటుంది. పార్లమెంటు ఆమోదించే చట్టాలు సైతం రాజ్యాంగానికి లోబడి ఉన్నాయా లేవా అని సమీక్షించి నిర్ణయం తీసుకొనే అధికారం సుప్రీంకోర్టుకు ఉంటుంది కదా? శాసనసభలు ఆమోదించిన బిల్లులకు గవర్నర్లు, రాష్ట్రపతి ఆమోదముద్ర వేయకుండా నెలలూ, సంవత్సరాల తరబడి పక్కన పడేస్తే ప్రజలు ఎన్నుకొన్న ప్రభుత్వాలు ఏమి చేయాలి? శాసనసభలు ఆమోదించిన బిల్లులు రాజ్యాంగానికి లోబడి లేని పక్షంలో ఆ విషయం చెప్పి తిరస్కరించవచ్చు. కానీ శాశ్వతంగా పెండింగ్‌లో ఉంచడం, అదేమంటే మా అధికారాన్ని ప్రశ్నించి, మాకు గడువు విధించే అధికారం సుప్రీంకోర్టుకు ఎక్కడిది? అని హుంకరించడం సమర్థనీయమా? గవర్నర్లు, రాష్ట్రపతి రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటే ఇలాంటి అవాంఛనీయ వివాదాలు తలెత్తవు కదా? మన దేశంలో రాజ్యాంగబద్ధమైన వ్యవస్థల విశ్వసనీయత కొంతకాలంగా మసకబారుతోంది.

# కృష్ణా జలాల్లో రాష్ట్ర వాటా సాధిస్తాం

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహంపై శనివారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సి.ఎస్.వైద్యనాథన్, కేంద్ర జలసంఘం మాజీ ఛైర్మన్ కె.వోహ్రా, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీ అంజద్ హుస్సేన్, సీఎంవో కార్యదర్శి మాణిక్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... "కృష్ణా జలాల్లో తెలంగాణకు ఇంతకాలం జరిగిన అన్యాయానికి అడ్డుకట్ట వేయాలి. రాష్ట్ర సాగు, తాగునీటి అవసరాలతోపాటు మెట్ట, కరవు ప్రాంతాలైన ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు కృష్ణా జలాలు తప్ప వేరే గత్యంతరం లేదనే విషయాన్ని ట్రైబ్యునల్ దృష్టికి బలంగా తీసుకెళ్లాలి.

నదీజలాల వాటాల పంపిణీ, సహజ న్యాయసూత్రాల ప్రకారం కొత్తగా ఏర్పడిన తెలంగాణకు కృష్ణాలో 904 టీఎంసీల నీళ్లు రావాల్సి ఉంది. అందుకనుగుణంగా వాదనలు సిద్ధం చేయాలి.

ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటివరకు కృష్ణాపై ఉన్న ప్రాజెక్టులు, నిర్మించతలపెట్టిన, అసంపూర్తిగా ఉన్న, నిర్లక్ష్యంగా వదిలేసిన ప్రాజెక్టుల వివరాలన్నీ ట్రైబ్యునల్ ముందుంచాలి.

పదేళ్లపాటు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం కృష్ణా జలాల్లో రావాల్సిన న్యాయమైన వాటాలను సాధించకపోగా... ఏపీకి 512 టీఎంసీలను కట్టబెట్టి, 299 టీఎంసీల వాటాకు ఒప్పుకొని తెలంగాణకు తీరని అన్యాయం చేసింది.

పాలమూరు నుంచి డిండి వరకు ప్రాజెక్టులన్నింటినీ నాటి ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. ఈ నిర్లక్ష్య, ఉదాసీన వైఖరి కారణంగా ఏపీ కృష్ణా జలాలను అక్రమంగా తరలించుకుపోయిన విషయాన్ని ట్రైబ్యునల్‌కు వివరించాలి. ఉమ్మడి రాష్ట్రంలోనూ తెలంగాణ ప్రయోజనాలను పట్టించుకోలేదు.

శ్రీశైలం జలాశయం పూర్తిగా నిండకముందే... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు నుంచి రోజుకు 10 టీఎంసీల నీటిని ఇతర బేసిన్లకు తరలిస్తోంది. ఇందుకోసం కాలువల సామర్థ్యాన్ని పెంచుకుంటోంది. పట్టిసీమ తదితర ప్రాజెక్టుల నుంచి సైతం ఏపీ అక్రమంగా నీటిని తరలిస్తున్న తీరును ఆధారాలతో సహా ట్రైబ్యునల్‌కు నివేదించాలి" అని సీఎం న్యాయ నిపుణులకు సూచించారు.

బూర్గుల నిబద్ధత నేటితరానికి ఆదర్శం: సీఎం

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావుకు ప్రజల పట్ల ఉన్న నిబద్ధత నేటి తరానికి ఆదర్శం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బహుభాషావేత్తగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా, రాజనీతిజ్ఞుడిగా ఆయన రాష్ట్రానికి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆదివారం బూర్గుల వర్ధంతి సందర్భంగా ఆయన చేసిన సేవలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. వినోబాభావే ప్రారంభించిన భూదానోద్యమానికి బూర్గుల చట్టబద్ధత కల్పించి భూ సంస్కరణలకు నాంది పలికారన్నారు.

## సీఎం రేవంత్ నివాసంలో కీలక సమావేశం.. జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై చర్చ..!

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: జూబ్లీహిల్స్ లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో కీలక సమావేశం జరుగుతోంది. ఈ సమావేశానికి టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ భేటీలో ప్రధానంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక గురించి చర్చిస్తున్నారు. మంత్రులతో పాటు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నియోజకవర్గ ఇంచార్జ్ కార్పొరేషన్ల చైర్మన్లు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు.

అభ్యర్థి ఎంపిక, ఉప ఎన్నికలో అనుసరించాల్సిన వ్యూహాలు, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా డిస్కస్ చేస్తున్నారు. నియోజకవర్గంలో పెండింగ్ పనులు, కొత్త సాంక్షన్స్, సంక్షేమ పథకాల పంపిణీ, ముస్లిం గ్రేవి యార్డ్?తో పాటు ఇతర అంశాలపై చర్చిస్తున్నారు. డివిజన్ల, బూత్ స్థాయిలో కార్యకర్తల పని తీరు, సమన్వయం వంటి అంశాల గురించి మాట్లాడుతున్నారు. టికెట్ కోసం తీవ్రమైన పోటీ నెలకొనడంతో.. ఆశావహుల పని తీరుపైన డిస్కస్ చేయనున్నట్లు సమాచారం.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు సీరియస్?గా తీసుకున్నాయి. అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి. సిట్టింగ్ స్థానాన్ని తిరిగి ఎలాగైనా నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్ చూస్తుంటే.. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నెగ్గి రాష్ట్రంలో తమ ప్రభుత్వానికి ప్రజాధరణ ఏ మాత్రం తగ్గలేదని ప్రతిపక్షాల విమర్శలకు కౌంటర్ ఇవ్వాలని అధికార కాంగ్రెస్ పార్టీ ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నాయి. మరోవైపు.. గ్రేటర్?లో తమకు మంచి పట్టు ఉండటంతో జూబ్లీహిల్స్ గడ్డపై కాషాయ జెండా ఎగరేయ్యాలని బీజేపీ ప్రణాళికలు రచిస్తోంది.

ఇదిలా ఉంటే.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు దాదాపు బీఆర్ఎస్ అభ్యర్థి పేరు ఖరారైంది. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ సతీమణి సునీతను బరిలోకి దించనున్నట్లు బీఆర్ఎస్ పరోక్షంగా సంకేతాలు ఇచ్చింది. ఈ తరుణంలో సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై కీలక సమావేశం నిర్వహిస్తుండటంతో అభ్యర్థి ఎంపికపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

## క్యాన్సర్ టీకాలతో వారికే ప్రయోజనమా..!

మొదటి పేజీ తరువాయి

ప్రపంచవ్యాప్తంగా పెద్దపేగు క్యాన్సర్(సీఆర్సీ)కేసులు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో వీటికి సంబంధించి కొచ్చిలో గ్యాస్ట్రోఇంటెస్టినల్ ఆంకాలజీ సొసైటీ ఆధ్వర్యంలో వార్షిక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేరళ ఐఎంఏ రీసెర్చ్ సెల్ కన్వీనర్ డాక్టర్ రాజీవ్ జయదేవన్ మాట్లాడుతూ.. క్యాన్సర్ చికిత్సా విధానాలు, వ్యాక్సిన్ రూపకల్పనలో సాధిస్తున్న పురోగతిని వివరించారు.

ఒక్క టీకా.. తప్పిస్తుంది పెద్ద ముప్పు

" ఇవి ఇప్పటికే క్యాన్సర్‌తో బాధపడుతున్న వ్యక్తుల్లో పునరావృతం కాకుండా నిరోధించేందుకు రూపొందించిన చికిత్సాపరమైన వ్యాక్సిన్‌లు. ఆరోగ్యకరమైన వ్యక్తుల్లో క్యాన్సర్‌ను నివారించేందుకు కావు" అని డాక్టర్ జయదేవన్ స్పష్టం చేశారు. ఇవన్నీ క్యాన్సర్ కణాలను గుర్తించి, నాశనం చేసేలా శరీర సొంత రోగనిరోధక వ్యవస్థకు శిక్షణ ఇచ్చే ఓ రకమైన ఇమ్యూనోథెరపీనేనని చెప్పారు. క్యాన్సర్ చికిత్సా విధానంలో వేగంగా మార్పులు వస్తున్నాయని, ఆయా వ్యక్తులకు అనుగుణంగా చికిత్స అందించాల్సిన అవసరం ఉందని ఈ కార్యక్రమ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ అరుణ్ ఆర్ వారియర్ పేర్కొన్నారు.

మూడురోజుల పాటు కొనసాగిన ఈ సదస్సులో అంకాలజిస్టులు, గ్యాస్ట్రోఎంటెరాలజిస్టులు సహా దాదాపు 200లకుపైగా వైద్య నిపుణులు పాల్గొన్నారు. క్యాన్సర్ నిర్మూలన, స్క్రీనింగ్‌తోపాటు చికిత్సా విధానాలపై చర్చించారు. సర్జరీ, రేడియేషన్, సీఆర్సీ జన్యు సంబంధమైన అంశాలపై వర్క్‌షాప్‌లు నిర్వహించారు.

## ఈవెంట్స్ ఇండస్ట్రీతో కలిసి పనిచేయడానికి ప్రభుత్వం సిద్ధం: మంత్రి జూపల్లి

మొదటి పేజీ తరువాయి

ఈవెంట్స్ ఇండస్ట్రీ ద్వారా విదేశాలకు వెళ్లకుండానే తెలంగాణను డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు అద్భుతమైన కేంద్రంగా మార్చవచ్చని మంత్రి చెప్పారు. రాజస్థాన్‌తో పోలిస్తే తెలంగాణలో గొప్ప చారిత్రక కట్టడాలు, సంస్కృతి, పురాతన ప్యాలెస్‌లు ఉన్నాయని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో రూ.కోట్లు ఖర్చు చేసే బదులు మన రాష్ట్రంలోనే ఆ వేడుకలు నిర్వహించుకోవడం ద్వారా పర్యాటక రంగానికి ఊతం ఇవ్వొచ్చని మంత్రి అభిప్రాయపడ్డారు. వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్ సదస్సులో తెలంగాణ పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, తెలంగాణ ఛాంబర్ ఆఫ్ ఈవెంట్స్ అధ్యక్షులు బలరాం బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఐదేళ్లుగా విమోచన దినోత్సవాన్ని కేంద్రమే నిర్వహిస్తోంది

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా విమోచన దినోత్సవాన్ని కేంద్రం నిర్వహిస్తోందన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఆనాడు ప్రజలు పోరాడారని గుర్తు చేశారు. రజాకార్ల హింసాకాండపై ప్రజలు తిరుగుబాటు చేశారు.. అప్పటి ప్రజల ఇబ్బందులు, పోరాటాలు తెలిపేలా ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

### ఏర్పాట్లు పరిశీలించిన రాష్ట్ర భాజపా నేతలు

కేంద్ర సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ఈనెల 17న ఉత్సవాలను అధికారికంగా నిర్వహించనున్నారు. ముఖ్య అతిథులుగా కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు పలువురు కేంద్ర మంత్రులు, మహారాష్ట్రకు చెందిన మంత్రులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను రాష్ట్ర భాజపా నేతలు పరిశీలించారు.

## తెలంగాణ వ్యాప్తంగా తనిఖీలు.. భారీగా పట్టుబడ్డ గంజాయి

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా డ్రగ్స్ కేంద్రాలు, ముఠాలపై ఈగల్, జీఆర్పీ, ఆర్పీఎఫ్, పోలీసు బలగాలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. రైళ్లు, పారిశ్రామిక వాడల్లో చేపట్టిన తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుబడింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో 91 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. రైళ్లలో గంజాయి సరఫరా చేస్తోన్న నలుగురిని, రైలులో గంజాయి తరలిస్తున్న మరో ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వరంగల్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు చేయగా.. 32 కిలోల గంజాయి పట్టుబడింది. ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వరంగల్‌లో మరోచోట 214 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని, సరఫరాదారుడిని అదుపులోకి తీసుకున్నారు. ములుగు జిల్లా వాజేడులో 30 కిలోల గంజాయి పట్టుబడగా.. ఇద్దరిని అరెస్టు చేశారు. సంగారెడ్డిలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో అల్ప్రాజోలం తయారీ యూనిట్ గుట్టురట్టయింది. 270 గ్రాముల అల్ప్రాజోలం, 7.89కిలోల నోర్డాజీపమ్, రూ.16.31లక్షలు విలువైన డ్రగ్స్, పరికరాలు స్వాధీనం చేసుకున్నారు.

## వలపు వల.. యోగా గురు విలవిల

మొదటి పేజీ తరువాయి

రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ఓ వ్యక్తి యోగా ఆశ్రమం నిర్వహిస్తున్నారు. అనారోగ్యం పేరుతో ఇద్దరు మహిళలు ఆయన ఆశ్రమంలో చేరారు. కొన్నాళ్లుగా యోగా గురుతో సన్నిహితంగా మెలిగారు. వారితో సన్నిహితంగా ఉన్నప్పుడు అతనికి తెలియకుండా వీడియోలు తీశారు. ఆ తర్వాత అమర్ అనే వ్యక్తి.. మహిళలతో సన్నిహితంగా ఉన్నప్పటి వీడియోలు చూపించి యోగా గురును బ్లాక్ మెయిల్ చేయడం మొదలుపెట్టాడు. పలు దఫాలుగా రూ.50లక్షలు వసూలు చేశాడు. అంతటితో ఆగకుండా మరో రూ.2కోట్లు ఇవ్వాలని బెదిరింపులకు దిగాడు. దీంతో బాధితుడు చేవెళ్ల పోలీసులను ఆశ్రయించడంతో అమర్ ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## అస్సాంలో భూకంపం.. 5.8 తీవ్రతతో ప్రకంపనలు

మొదటి పేజీ తరువాయి

అస్సాంలో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 5.8 తీవ్రతగా నమోదైంది. ఉదల్‌గిరి జిల్లాలోని ధేకియజులి ప్రాంతానికి 16 కి.మీ దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ వెల్లడించింది. 5.కి.మీ లోతులో ఇది సంభవించిందని పేర్కొంది. భూకంప తీవ్రతకు పలు ఇళ్లు స్వల్పంగా ఊగినట్టు సమాచారం. అయితే, ఇప్పటివరకు ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని అస్సాం అధికారులు వెల్లడించారు.మేఘాలయ, మణిపూర్, త్రిపుర రాష్ట్రాల ప్రజలు కూడా తమ ప్రాంతాల్లో ప్రకంపనలు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈశాన్య రాష్ట్రాలతో పాటు బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, మయన్మార్, చైనాలోనూ భూ ప్రకంపనలు వచ్చినట్లు తెలిసింది. అస్సాంలోని ఇదే ప్రాంతంలో (సోనిత్‌పూర్‌లో) వారం క్రితం 3.5 తీవ్రతతో భూకంపం సంభవించింది. ప్రధాని మోదీ ప్రస్తుతం అస్సాం పర్యటనలోనే ఉన్న విషయం తెలిసిందే.అస్సాం మాజీ సీఎం, కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ 'ఎక్స్'లో స్పందించారు. రాష్ట్రంలో భారీ భూకంపం సంభవించిందని.. ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉండాలని కోరుకుంటున్నానని, ఇదే సమయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. భూకంప తీవ్రత అధికంగా ఉందని పేర్కొంటూ సోషల్ మీడియాలో స్థానికులు పోస్టులు పెడుతున్నారు. కాంగ్రెస్ నేత భూపెన్ కుమార్ బోరా కూడా తన నివాసంలో ఓ పూలకుండీ కదిలిపోతున్న వీడియోను పోస్టు చేశారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం సెప్టెంబర్ 15 2025

## మెట్ పల్లి మార్కెట్ చైర్మన్ సోదరుడి మృతి



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
మెట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ సోదరుడు కూన గంగధర్ ఆదివారం తుది శ్వాస విడిచారు. ఈ విషాదకర సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న టీపీసీసీ డెలిగేట్ సుజిత్ రావు తన బృందంతో కలిసి ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామంలో జరిగిన అంత్యక్రియలకు హాజరై, కూన గోవర్ధన్ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు, బంధువులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో ఖాళీ సీట్ల భర్తీ

**– స్పాట్ అడ్మిషన్ల్ల ౹ల**



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**
జగిత్యాల జిల్లా మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025–2026 విద్యా సంవత్సరానికి బీఏ, బీకాం కోర్సులలో ఖాళీగా ఉన్న సీట్లను "దోస్త్" ద్వారా "స్పాట్" అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వేంకయ్య తెలిపారు. ఉన్నత విద్యా కమిషనర్ సూచనల మేరకు, "దోస్త్" ద్వారా దరఖాస్తు చేసుకోని విద్యార్థులు ఈ నెల 15, 16 తేదీలలో స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## యువతి పెళ్లికి ఎమ్మెల్యే చేయూత



**– ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే**

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన యువతి సానియా బేగం వివాహ ఖర్చుల కోసం కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ రూ. 10,000 ఆర్థిక సహాయం అందించారు. ఆదివారం స్థానిక మెట్‌పల్లి పట్టణ బీఆర్‌ఎస్ నాయకుల ద్వారా ఈ సహాయాన్ని సానియా బేగం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యే సంజయ్ ప్రజల సంతోషం కోసం, ఇబ్బందుల్లో తోడుగా నిలవడం ద్వారా సేవకు మారుపేరుగా నిలుస్తున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు.

## కుషాయిగూడలో రియల్టర్ హత్య - నలుగురు అరెస్ట్



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
కుషాయిగూడలో రియల్ వ్యాపారి శ్రీకాంత్రెడ్డి హత్య కేసులో పోలీసులు నలుగురిని అరెస్ట్ చేశారు. నిందితులు ధనరాజ్, డానియల్, సంతోష్, ముఖేష్లను ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వీరిని కుషాయిగూడ పోలీసులకు అప్పగించారు. నడిరోడ్డుపై గొంతుకోసి హత్య చేసిన ఈ కేసులో విచారణ కొనసాగుతోంది.

## రైతులకు రుణమాఫీ కాలేదు

**– ప్రశ్నిస్తే పట్టించుకోవట్లేదు**




**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
రైతులకు రుణమాఫీపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఘట్కేసర్ మండలంలో 1,100 మంది రైతుల్లో ఒక్కరికి కూడా రుణమాఫీ కాలేదని మండిపడ్డారు. 'గతంలో నిలదీస్తే 10 రోజుల్లోనే చేస్తామన్నారు.. నెలలు గడుస్తున్నా పట్టించుకోలేదు. ఇలాంటి పరిస్థితిలో ఏం చేయాలో తెలీక 4 రోజుల నుంచి రైతులు ధర్నా చేస్తుంటే.. ఎలాంటి హామీ ఇవ్వని సర్కార్ ఇప్పుడు పోలీసుల చేత బెదిరింపులకి పాల్పడుతోంది' అని విమర్శించారు.

## మోడీ కార్మిక వ్యతిరేక విధానాలపై సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలి

**గట్టుప్పల సెప్టెంబర్14 కరపత్రం ప్రతినిధి**
కేంద్రంలో 3 వసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడ్స్ తెచ్చి కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చే విధానంపై సమరశీల ఉద్యమాలకు కార్మిక వర్గం సిద్ధం కావాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు ల్.ఆదివారం సిఐటియు గట్టుపల మండల జనరల్ బాడీ సమావేశం అచ్చిని బీరప్ప అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మిక వర్గానికి వ్యతిరేకంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేసే వరకు కార్మిక వర్గ పోరాటాలు ఆగవని హెచ్చరించారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను స్వదేశీ విదేశీ కార్పొరేట్ కంపెనీలకు ద్వారా దత్తం చేస్తుందని విమర్శించారు.

# భూమికోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడింది ఎర్రజెండానే..

- వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చరిత్రను వక్రీకరించడం తగదు
- తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట అమరవీరుల స్ఫూర్తితో ప్రజా పోరాటాలు నిర్మిస్తాం
- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మానిక్




**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి**
భూమికోసం భుక్తి కోసం వెట్టిచాకిరి నుండి విముక్తి కోసం పోరాడింది ఎర్రజెండానే.. అని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను మతోన్మాద శక్తులు వక్రీకరిస్తున్నాయని సిపిఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మానిక్ అన్నారు. జిల్లాలోని కొండాపూర్ మండలం గంగారం గ్రామంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవం సభ జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ నాడు దేశముకులకు, జమీందారులకు, నిజాం నిరంకుశ రాచరిక వ్యవస్థ వ్యతిరేకంగా దోపిడికి గురవుతున్న పేద ప్రజలను ఐక్యం చేసి కమ్యూనిస్టు పార్టీ పోరాడిందన్నారు. మట్టి మనుషులను తట్టి లేపి బాంచన్ దొర అన్న వాళ్లతో దొరలను ఉరికించిన చరిత్ర ఎర్రజెండా పోరాటానికి ఉందని అన్నారు. పదిలక్షల ఎకరాల భూమిని పంచిన చరిత్ర ఎర్రజెండాకు ఉందన్నారు. ఈ పోరాటంలో 4,000 మంది ప్రాణాలు అర్పించిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీకి దక్కిందని ఆయన అన్నారు. ఈ పోరాటానికి వారసులు కమ్యూనిస్టులు తప్ప మరో వ్యక్తులు కాదన్నారు. ఏ మాత్రం సంబంధం లేని మతోన్మాద శక్తులు ఆ పోరాటానికి మేము వారసులమని చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఆశయాన్ని కొనసాగించడంలో పాలకవర్గాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం దేశ సంపాదను కొల్లగొట్టి బడా బాబులకు కట్టబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీలు త్రిబుల్ ఆర్ రింగ్ రోడ్లు అభివృద్ధి పేరుతో పేదల భూములు, ప్రభుత్వ భూములు కారు చౌక కట్టబెడుతున్నారన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో నేటి ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని, ఎర్రజెండా ఆధ్వర్యంలో భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ వార్షికోత్సవ సభలో కొండాపూర్ మండల కార్యదర్శి కె రాజయ్య, మండల కమిటీ సభ్యులు బాబురావు, ప్రవీణ్, నాయకులు అనిల్, సద్దాం, రామ్ చరణ్, ఆంజనేయులు, కృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ సంకల్పం

**– రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
తెలంగాణ రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ సంకల్పమని, మహిళల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం వేములవాడ పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురు మహిళలు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే సంకల్పంతో ముందుకు పోతున్నారని, అందులో భాగంగా రాష్ట్రంలో ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ప్రారంభించడం జరిగిందని తద్వారా మహిళలకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేసి వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి సంకల్పించారని అన్నారు.. అనాడు ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు మేలు జరిగితే మళ్లీ రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో మహిళా తల్లిలకు పేద్ధపీఠ వేయడం జరుగుతుందని తెలిపారు.. ప్రజా ప్రభుత్వంలో మహిళలకు 20వేల పైచిలుకు కోట్లను కేటాయించడం జరిగిందని తెలిపారు.మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్, ఆర్టీసీ సంస్థకు అద్దె బస్సులు, పెట్రోల్ పంప్, ధాన్యం కొనుగోలు, రైస్ మిల్ వంటి అనేక వ్యాపారాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం నూతనంగా అందించే రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లను కూడా మహిళల పేరు మీద మంజూరు చేస్తుందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు వారు ఆర్థికంగా ఎదగాలని మైక్రో ఎంటర్ప్రైజేషన్, మహిళా శక్తి స్టిచ్చింగ్ సెంటర్స్, ఈవెంట్ మేనేజ్మెంట్ యూనిట్లో, సోలార్ పవర్ ప్లాంట్, డైరీ యూనిట్స్ వంటి వాటిని ఏర్పాటు చేయడం కోసం బ్యాంకు లింకేజీ వడ్డీ లేని రుణాలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.. 2024 25 ఆర్థిక సంవత్సరానికి బ్యాంకు లింకేజీ ద్వారా 20084 కోట్లు, 2025–26 సంవత్సరానికి 58 కోట్లు బ్యాంకు లింకేజీ అందజేయడం జరిగిందని తెలిపారు...4350 సంఘాలకు 5 కోట్ల 72 లక్షల వడ్డీ లేని రుణాలను మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు.. మహిళా సంఘాల సభ్యురాళ్లకి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన లోన్ బీమా, ప్రమాద బీమా స్కీం వలన ఎంతో మందికి ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.. ప్రమాదవశాత్తు ఎవరైనా సంఘ సభ్యులు చనిపోతే వారు తీసుకున్న రుణం మాఫీ తో పాటు పదిలక్షల వరకు ఇన్సూరెన్స్ చెల్లించడం జరుగుతుందని తెలిపారు..

# త్రిబుల్ ఆర్ కోసం రైతుల నుండి బలవంతంగా భూములు తీసుకోవద్దు

**– సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మానిక్**





**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి**
త్రిబుల్ ఆర్ రోడ్డు కోసం రైతుల నుండి బలవంతంగా భూములు తీసుకోవద్దని రియల్ ఎస్టేట్ వెంచర్లను, భూస్వాముల భూములను వదిలేసి పేద రైతుల భూముల నుండి త్రిబుల్ ఆర్ రోడ్డు వేస్తారా..అని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం కొండాపూర్ మండల పరిధిలోని మాచ్చెపల్లి, గోటిలగుట్ట తాండ, రాంపూర్ తాండ, మారేపల్లి గ్రామాల రైతులతో కలిసి సిపిఎం నాయకులు పర్యటించి, రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాణిక్ మాట్లాడుతూ త్రిబుల్ ఆర్ రోడ్డు కోసం గ్రామాలలో ఏ సర్వే నంబర్లో భూములు తీసుకుంటామని ప్రభుత్వం నోటీసు వేయడంతో కొండాపూర్ మండలంలోని గిర్మాపూర్, అలియాబాద్, మారేపల్లి, మాచేపల్లి, గంగారం, శివన్న గూడెం, రాంపూర్ తాండ, గోటీలగుట్ట తాండ గ్రామాల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. ఇప్పటికే త్రిబుల్ ఆర్ రోడ్డు కోసం నాలుగు సార్లు మ్యాప్ మార్పు చేశారని అన్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్లు, భూస్వాముల భూములు కాపాడి వారి ప్రయోజనాలు రక్షించడానికే ప్రభుత్వం సిద్ధపడుతుందన్నారు. సన్నా చిన్న కారు పేద రైతుల వ్యవసాయ భూముల నుండి త్రిబుల్ ఆర్ రోడ్డు వెయ్యడం దారుణమన్నారు. రైతులు తాత ముత్తాతల నుండి సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారని, ఉన్న కాస్త భూములను త్రిబుల్ ఆర్ రోడ్డు కోసం తీసుకుంటే రైతులు ఏ విధంగా బతుకుతారని అన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న అంటూ చెబుతున్న ప్రభుత్వాలు ఆ రైతన్న జీవనం సాగించ్చే భూమిని ఈరోజు ప్రభుత్వాలు రింగురోడ్ల పేరుతో బడా కంపెనీల పేరు మీద భూములను లాక్కొడం రైతులను రోడ్డుపైన పడేసే పరిస్థితి తీసుకోస్తున్నారని ఆయన అన్నారు.. ఆర్ఆర్ఆర్ లో పట్టా భూములు కోల్పోవడంతో రైతులు రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల నుండి బలవంతంగా భూసేకరణ చేయోద్దని, త్రిబుల్ ఆర్ కోసం వేసిన నోటిఫికేషన్ లో పేద రైతులు, దళిత, గిరిజన, బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. దీనిని వెంటనే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులందరిని ఏకంచేసి పెద్ద ఎత్తున పోరాడుతామని హెచ్చరించారు.
రైతులు మాట్లాడుతూ మా తాతలు ముత్తాతల నుండి ఈ భూములనే నమ్ముకుని బతుకుతున్నామని తెలిపారు. ఈ భూములు పోతే మాకు బతికే లేదని, మా భూముల కోసం మా ప్రాణాలు అయినా ఇస్తామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కే రాజయ్య, మండల కమిటీ సభ్యులు బాబురావు, ప్రవీణ్, కిషన్, వెంకన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అర్జున్, రైతులు అశోక్, పాండు, కేశవ్, బీన్ సింగ్, అంబర్ సింగ్, గణేష్, రాజు, విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## యజ్ఞ మహోత్సవానికి ఎంపీ ఈటలకి ఆహ్వానం



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ నియోజకవర్గం శామీర్ పేట్ లో జె.కె. శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణుల కమిటీ సభ్యులు ఎంపీ ఈటల రాజేందర్ ను 17వ తేదీన జగద్గిరి గుట్ట కొండపై ఉన్న బ్రహ్మంగారి ఆలయంలో జరిగే యజ్ఞ మహోత్సవంలో పాల్గొనవలసిందిగా ఆహ్వానించారు. ఈ మేరకు శనివారం ఎంపీకి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు హనుమంత చారి, శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

# గుంతలమయంగా మారిన అల్లాదుర్గం రహదారి





**- పట్టించుకోని అధికారులు**
**- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు**

**కరపత్రం ప్రతినిధి అందోలు**
ఉమ్మడి మెదక్ జిల్లాలోని అల్లాదుర్గం తెలంగాణ రాష్టంలోనే ప్రసిద్ధిగాంచింది. ఈ గ్రామంలో రేణుక ఎల్లమ్మ, బేతాళ స్వామి ఆలయాలు ప్రఖ్యాతిని గడించాయి. తెలంగాణ వ్యాప్తంగా ఎంతోమంది భక్తులు ఇక్కడికి వస్తుంటారు. అలాగే ప్రతి ఏటా భేతాళ స్వామి జాతర ఉత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతాయి. కానీ ప్రస్తుతం ఈ గ్రామానికి వెళ్లే రహదారి మాత్రం గుంతల మయంగా మారి ప్రమాదకరంగా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇది ఎక్కడో కాదు ప్రస్తుత రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న అందోలు నియోజకవర్గం అల్లాదుర్గం సబ్ డివిజన్ లో ఉండడంతో పలువురు ఈ రహదారిని బాగు చేయాలని కోరుతున్నారు. అల్లాదుర్గ్ సబ్ డివిజన్ కేంద్రంలోని జాతీయ రహదారి నుండి గ్రామానికి వెళ్లె దారి పొడువునా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆ రోడ్డు మార్గంలో ప్రయాణిస్తున్న వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో ద్విచక్ర వాహన దారులైతే ఆ దారిన ప్రయాణించాలంటేనే జంకుతున్నారు. ఏ గోతిలో పడి ఆసుపత్రి పాలవుతామోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన దుస్థితి దాపురించింది. ఇదే విషయాన్ని అక్కడ ఉన్న స్థానికులను ప్రశ్నించగా సంవత్సరాలు గడుస్తున్నా.. ప్రభుత్వాలు మారినా ఇక్కడి దేవాలయాలకు వెళ్ళే రహదారిని మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా స్థానిక మంత్రి పట్టించుకుని రొడ్డుకు మరమత్తులు జరిగేలా కృషి చేయాలని స్థానికులతో పాటు ప్రయాణికులు కోరుతున్నారు.

# సేవా పక్షం మండల సమావేశం.

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ సెప్టెంబర్ 14**
రామడుగు మండల కేంద్రంలో సేవా పక్షం మండల కన్వీనర్ పోచంపెల్లి నరేష్ ఆధ్వర్యంలో సేవా పక్షం మండల కార్యశాల నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మండల ఇంచార్జి జాడి బాల్ రెడ్డి హాజరయ్ మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ఈ నెల 17 వ తేదీ రోజున ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా పక్షం రోజులు పార్టీ తెలిపిన సేవ కార్యక్రమలు గాంధీ జయంతి వరకు నిర్వహించాలనీ, తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ప్రతి బూత్ లో జాతీయ జెండా ఎగురవేయాలి అని తెలిపారు. మండల కేంద్రంలో బ్లడ్ డోనేషన్ క్యాంప్,శక్తి కేంద్రం ఇంచార్జి పరిధిలో స్వచ్ భారత్ కార్యక్రమలు,జన్మదినం సందర్భంగా పండ్లు పంపిణీ వంటి కార్యక్రమలు నిర్వహించాలి అని అన్నారు.దీన్ దయల్ జయంతి



రోజున ప్రతి బూత్ లో ఐదు మొక్కలు నాటాలని , అక్టోబర్ రెండవ తేదీన గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి ల జయంతి వేడుకలు ప్రతి బూత్ లో నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల శాఖ అధ్యక్షులు ఒంటెల కరుణాకర్ రెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు బండ తిరుపతి రెడ్డి,మండల ప్రధాన కార్యదర్శి పురేళ్ల శ్రీకాంత్ గౌడ్,మండల ఉపాధ్యక్షులు వేముండ్ల కుమార్,కళ్లెం శివ,జాతరగొండ ఐలయ్య,మండల కార్యదర్శిలు గుంట అశోక్,కడారి స్వామి,దళిత మోర్చా మండల అధ్యక్షుడు సంటి జితేందర్, యువ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి దయ్యాల రాజు,మండల ఉపాధ్యక్షుడు బండారి శ్రీనివాస్, మండల అధికార ప్రతినిధి మాడిశెట్టి అనిల్,సీనియర్ నాయకులు కట్ట రవీందర్,బద్ధం లక్ష్మారెడ్డి,షేవెళ్ల అక్షయ్, బూత్ కమిటీ అధ్యక్షులు దయ్యాల వీరమల్లు,దైవల తిరుపతి గౌడ్,ఉత్తేమ్ కనుకరాజు,బుర్ర శ్రీధర్,ఎగుర్ల ఎల్లయ్య,మడికంటి శేఖర్,మంద రాజశేఖర్,వెంకట్ రెడ్డి,పురంశెట్టి మల్లేశం,వద్లూరి రాజేందర్ చారి తదితరులు పాల్గొన్నారు.

# తత్వవేత్త ఆధ్యాత్మిక గురువు డాక్టర్ సత్యంగౌడ్ కు జాతీయ స్థాయి విశ్వ గురువు ప్రధానం.....

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్:**
తత్వవేత్త ఆధ్యాత్మిక గురువు డాక్టర్ సత్యంగౌడ్ జాతీయ స్థాయి విశ్వ గురువు పురస్కారాన్ని అందుకున్నారు. పట్టణానికి చెందిన ప్రముఖ కవి రచయిత మానవ విలువల పరిరక్షణ సేవా సంస్థ జాతీయ అధ్యక్షులు వ్యక్తిత్వ వికాస నిపుణులు తత్వవేత్త బ్రహ్మశ్రీ డాక్టర్ నాగుల సత్యం గౌడ్ కు తెలుగు ఇండియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ మరియు శ్రీ విరాట్ విశ్వకర్మ విజ్ఞాన ఆధ్యాత్మిక ధార్మిక కళా పరిషత్ జాతీయ సంస్థల పక్షాన శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం 2025 సంవత్సరమును పురస్కరించుకొని సత్యం గౌడ్ సామాజిక, ఆధ్యాత్మిక సేవలు, మరియు సమాజానికి ఉపయోగపడే రచనలు రాలిస్తూ మానవత విలువలు పెంపొందించే దిశగా బోధనలు సెమినార్లు ఇస్తున్న వీరి విశిష్ట గుర్తించి వీరిని ... విశ్వ గురువు జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పురస్కారాన్ని హుస్నాబాద్ మండల కేంద్రం నాగారం రోడ్డు శ్రీ రాజ్యలక్ష్మి కాన్వెంట్స్ హాల్లో ముఖ్య అతిథులుగా వచ్చిన నాయకులు వివిధ స్వచ్ఛంద సేవ సంస్థల వ్యవస్థాపకులు అధ్యక్షులు, ఈ సంస్థల వ్యవస్థాపకులు ప్రముఖులు, సిద్దిపేట గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి, బ్రహ్మశ్రీ డాక్టర్ కాళీ



జగన్నాథం చేల్లేటి కృష్ణమాచార్యులు, జగన్నాథం, అధ్యక్షులు కౌన్సిలర్ జ్యోతి ,కడెం లింగయ్య, విశ్వ కళ విరాట్ బ్రహ్మశ్రీ వంగల శాంతి కృష్ణ ఆచార్యులు, విశ్వకర్మ రాష్ట్ర సంఘం అధ్యక్షులు కార్యకర్త సభ్యులు, ఈ సంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు విశ్వ విరాట్ కళ రత్న బ్రహ్మశ్రీ పోలోజ్ రాజ్ కుమార్, పోడిశెట్టి విష్ణువర్ధన్, గురూజీ వీరధర్మరాజు స్వామి, చింతగుట్ట పీఠాధిపతి, పోడిశెట్టి విష్ణువర్ధన్ ఆచార్యులు శ్రీనివాసచార్యులు చింతగట్టు పీఠాధిపతి గురూజీ వీర ధర్మరాజ స్వామి భాస్కరాచార్యులు వెంపటి శ్రావణి నారాయణదాసు జ్యోతి పోలోజు భాస్కరాచార్యులు గార్లు సత్యం గౌడ్ పట్టు శాలువ కప్పి గురు కిరీటం, ధరింపజేసి బొకేలు జ్ఞాపకం అందజేసి జాతీయస్థాయి విశ్వ గురువు పురస్కారంతో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమం వచ్చిన ముఖ్య అతిథులు, ప్రముఖులు మాట్లాడుతూ... సత్య గౌడ్ సామాజిక రచనలు వారి ఆధ్యాత్మిక బోధనలు, సమాజానికి ఉపయోగపడే రచనలు రాణిస్తూ, ఎందరో విద్యార్థులకు మోటివేషన్ చేస్తూ ,ప్రతి విద్యార్థి ప్రయోజకుడుగా ఎదగడానికి తన వంతు సెమినార్ల ద్వారా కృషి చేస్తూ, విద్యార్థుల ప్రయోజనాన్ని కోరుకుంటూ నిస్వార్ధంగా సేవలు అందిస్తున్న సత్యం గౌడ్ విశిష్ట సేవలను ప్రముఖులు కొనియాడారు. అనంతరం తత్వవేత్త ఆధ్యాత్మిక గురువు బ్రహ్మశ్రీ డాక్టర్ సత్యం గౌడ్ మాట్లాడుతూ .... ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకొని సమాజసేవలో భాగస్వాములై, నవభారత నిర్మాణానికి పునాదిగా నిలవాలన్నారు. అంటరాని స్వర్గాన్ని వదులుకొని, నిత్యజీవితంలో నిత్యం సత్యం పలుకుతూ, మనస్సాక్షిగా మెదులుతూ ఎవరికీ హాని కలిగించక జీవిస్తూ, ఈ మానవ జన్మను సార్థకం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతను అలవర్చుకొని, మనసును ప్రశాంతత పరుచుకొని, ప్రశాంతమైన జీవితాన్ని గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో కవులు రచయితలు కళాకారులు విద్యావేత్తలు డాక్టర్లు వివిధ సంఘాల స్వచ్ఛంద సంస్థల అధ్యక్షులు వ్యవస్థాపకులు తదితరులు పాల్గొన్నారు.

# గౌడా సంఘ యూత్ నూతన కమిటీ ఏర్పాటు ....

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ సెప్టెంబర్ 14**
- కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నియోజకవర్గంలోని ఉమ్మడి గ్రామపంచాయతీ చెల్పూర్ లో నూతన కమిటీ ఏర్పాటు ..
- పోటా పోటీనా యూత్ ఎలక్షన్ అధ్యక్ష పదవి పోలింగ్ ..
- చెల్పూర్ గ్రామా యూవకుడు పంజాల గణేష్ గౌడ్ యూవజన అధ్యేక్షునిగా నియామకం ..
- గౌడా సంఘ అభ్యున్నతి కోసం అహర్నిశలు కొట్లాడుతానని గౌడ కుల ఆడబిడ్డ ఐన ఎల్లమ్మ సాక్షిగా ప్రమాణం ..
- ఉమ్మడి చెల్పూర్ గ్రామా పంచాయతీ గౌడ కులస్థులు మరియు యూవజన నాయకులూ హర్షం ..



కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నియోజకవర్గం లోని ఉమ్మడి చెల్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఎల్లమ్మ ఆలయం వద్ద ఉమ్మడి చెల్పూర్ గ్రామానికి సంబంధించిన గౌడ కుల యువకులు నుతన క్రయవర్గం ఏర్పాటు చేసుకొని సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటు కోసం అహర్నిశలు కష్టపడుతూ ఎన్ని ప్రభుత్వాలు మరీనా సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయకపోయేసరికి గౌడ కుల యూవత ఏకం ఐ ఉమ్మడి చెల్పూర్ గ్రామపంచాయతీ లో అనగా చెల్పూర్ , శలపల్లి , ఇందిరానగర్ , రాజపల్లి , కురుమపల్లి , గ్రామాలలోని యూవత ఒక్కటిగా నిలిచి నూతన గౌడ యూవత కౌండిన్య యూత్ అసోసియేషన్ అని నూతన కమిటీని ఏర్పాటు చేసుకొని ఉమ్మడి చెల్పూర్ గ్రామా పంచాయతీ పరిధిలో హోరా హోరీగా ఎలక్షన్ నిర్వహించారు . ఈ ఎలక్షన్ లో ఉమ్మడి చెల్పూర్ గ్రామా యూత్ పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు , ఈ క్రమంలో 11 ఓట్ల మెజారిటీ తో అధ్యక్షుడిగా గెలుపొందిన పంజాల గణేష్ తండ్రి తిరుపతి గౌడ్ , ఉపాధ్యక్షుడిగా మోడెమ్ శివ ప్రసాద్ తండ్రి శ్రీనివాస్ , ప్రధాన కార్యదర్శి గా పంజాల అరవింద్ కోశాధికారిగా పంజాల శివ కుమార్ ఎన్నికయ్యారు. ఇట్టి కార్యక్రమానికి ఎన్నికల పరిశీలకులుగా గుడెల్లి రమేష్ మరియు నగునూరి అనిల్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చెల్పూర్ గ్రామానికి చెందిన యువకులు పాల్గొన్నారు.

# యూరియా పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని సెప్టెంబర్ 14:**
పాలకుర్తి మండలంలో రైతుల కోసం యూరియా పంపిణీని రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ పర్యవేక్షించారు. ఆదివారం మండలంలోని కొత్తపల్లి, రామారావుపల్లి, తక్కలపల్లి గ్రామాల రైతులతో సమావేశమై, వారి సమస్యలను తెలుసుకొని, యూరియా పంపిణీ ప్రక్రియను సమీక్షించారు. ఈ సందర్భంగా రైతులకు 120 నానో యూరియా బాటిల్స్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఇప్పటి వరకు పాలకుర్తి మండలంలోని రైతులకు మొత్తం 1120 ఎంటీ (24,800 బ్యాగులు) యూరియా పంపిణీ జరిగినట్లు వెల్లడించారు. ప్రస్తుతం రైతుల సౌకర్యార్థం యూరియా పంపిణీకి నాలుగు కేంద్రాలు అందుబాటులో ఉన్నాయనీ, అయితే రైతులు అధిక సంఖ్యలో రావడంతో రద్దీ దృష్టిలో ఉంచుకుని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్న ఉద్దేశంతో అదనంగా రెండు రైతు వేదికల ద్వారా కూడా యూరియా పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి రోజు 1 నుండి 2 కేంద్రాల ద్వారా నిరంతరాయంగా యూరియా పంపిణీ జరుగుతోందని, ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వ్యవసాయ శాఖ అధికారి బండి ప్రమోద్ కుమార్ వివరించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి, రామారావుపల్లి, తక్కలపల్లి గ్రామాల రైతులు యూరియా సరఫరాపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు




**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో వేములవాడ పట్టణంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం అమరవీరుల స్తూపం నుండి గుమ్మి పుల్లయ్య స్తూపం వరకు ర్యాలీ నిర్వహించి, స్వాతంత్ర్య సమరయోధుడు కామ్రేడ్ గుమ్మి పుల్లయ్య స్తూపం వద్ద వేములవాడ నియోజకవర్గ సీపీఐ పార్టీ ఇంచార్జ్, సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి రాములు జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజన్న సిరిసిల్ల జిల్లా సీపీఐ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మంద సుదర్శన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో వేములవాడ నియోజకవర్గ స్థాయి లో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ హయాం లో ఎన్నో ఎకరాల భూములు పేదలకు పంచడం జరిగిందని, 100 సం,, సుదీర్ఘ కాలంలో పేదల కోసం, కార్మికుల కోసం, బడుగు -బలహీన వర్గాల కోసం సిపిఐ పార్టీ ఎనలేని పోరాటాలు చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ సీపీఐ కార్యదర్శి ఎల్ల దేవరాజు, రూరల్ మండల కార్యదర్శి పండుగ. పోచమల్లు, భీడి కార్మిక సంఘం జిల్లా నాయకురాలు కేవి అనసూర్య, మున్సిపల్ కార్మిక సంఘం కార్యదర్శి పందుల మల్లేశం, గ్రామపంచాయతి కార్మిక సంఘం జిల్లా నాయకులు దుద్రపెల్లి రవీందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు, మధ్యాహ్నం భోజన కార్మికులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జోగిపేటలో శ్రీ సిద్ధివినాయక టౌన్ షిప్ వెంచర్



**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి.**




సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణంలో శ్రీ సిద్ధివినాయక టౌన్ షిప్ వెంచర్, బ్రౌచర్స్ అభివృద్ధికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హన్మమంతుని విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమం సిద్ధివినాయక టౌన్ షిప్, వెంచర్ యజమాన్యుల ఆధ్వర్యంలో కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి లుగా కైకలూరు మాజీ ఏమ్మెల్యే నాగేశ్వర్ రావు, నర్సింగ్ రావు, నరేందర్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు ఆకుల మాణయ్య, నాయకులు దుర్గ వరప్రసాద్, తిమ్మిగారి మధుసూదన్, జోగిపేట పట్టణ పాత్రికేయ అధ్యక్షులు ఆకుల రాంబాబు, స్థానిక కిరాణం అసోసియేషన్ మెంబర్ విజయ్ కుమార్, శబరి జనరల్ స్టోర్ యజమాని బి.శ్రీనివాస్, శ్రీ సిద్ధివినాయక టౌన్ షిప్ వెంచర్, బ్రౌచర్స్ యజమాన్యులు ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు), కాసాల ప్రవీణ్ తోపాటు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.